# పాలపొంగు

[కథానిక]

❀

## = శ్రీ నెల్లూరి కేశవస్వామి =

ఇంట్లో కాలుపెట్టగానే "అమ్మా! అమ్మా!" అంటూ కేక వేశాడు మూర్తి.

ఆకేకకి అదిరిపడి వంటింట్లో వున్న తల్లి ఒక్క పరుగున ఈవలి కొచ్చింది "ఏఁవిఁట్రా ?—ఏఁవిఁట్రా ?" అంటూ. కాని కొడుకునవ్వుమొహం చూసి మనసు కుదుటపడ్డది. "ఆ గావుకేక లేయకపోతేయేం నాయనా?" అంది.

అది వినిపించుకోకుండానే కొడుకు "అమ్మా! ఇవ్వాళేం జరిగిందనుకున్నావ్ ?" అన్నాడు.

"ఆఁ ?"—మళ్లీ ఆదుర్దా హెచ్చింది తల్లికి.

"అరొర్రె, నీ కింకా తెలీదూ ? వూళ్లో అంతా గోలగా వుంటేనూ. !"

"ఏఁవిఁటేవిఁటి !"—ఆమెకళ్లు మరీ పెద్దవైనై.

"ఇవ్వాళ హర్తాల్ అమ్మా! వూళ్లో దుకాణాలన్నీ మూసేశారు. స్కూళ్లన్నీ బందు."

"ఏఁ ?"

"స్ట్రయిక్ (సమ్మె)చేశాం"

"ఎందుకూ ?"

"నీ కింకా తెలీనేలేదా ? గాంధీజీ అరెస్టయాడమ్మా!"

"అయితే ?"

మూర్తి ఒఖ్ఖసారి చప్పబడ్డాడు! అంతేనా ? గాంధీజీ అరెస్టుకావడం అంటే అంతేనా ?....."కాంగ్రెసునాయకులంతా అరెస్టయారమ్మా!"

"మరి మీరు స్ట్రయికుచేయటం దేనికిరా ?"

బావుంది! దేశనాయకులంతా జైలుకు పోతూంటే, తాము స్ట్రయికు చేయటం దేనికట! ఏమేనా అర్థంవుందీ ? తల్లి అమాయకత, అవివేకం చూసి మూర్తికి ఆశ్చర్యం, కోపం, జాలీకూడా ఒఖ్ఖసారి పుట్టుకొచ్చాయి. ఈతల్లికొడుకేనా తాను ?

"వాళ్లంతా జైలుకుపోవటం మీకు సంతోషమేనేంరా ?"

"ఎవరన్నారు ?"

"మరి మీరు పాఠాలు ఎగ్గొట్టం దేనికి ?"

ఎంత అవివేకం! అవాళ స్ట్రయిక్ చేయటం పాఠాలు ఎగ్గొట్టానికా ?

"అబ్బ! నీకు తెలీదులేవే, వూరుకో"అన్నాడు మొహం చిట్లించుకుంటూ. "అసలుసంగతి వినవేం ? ఇవాళ మాస్కూల్లో బలే గమ్మత్తు జరిగింది"—మళ్లీ వుత్సాహాన్ని పురస్కరించుకుంటూ అన్నాడు.

"మరి తొందరగా కానీ, ఆవలనాకు పనుంది."

"వంటేకదూ ? అబ్బ! నీ కెప్పుడూ వంటేనే. వూళ్లకు వూళ్లు తగలడిపోతూన్నా, నీవంటే వంట!"

కొడుకుచీకాక్కి తల్లికి నవ్వొచ్చింది. "వెఱ్ఱి నాన్న! అదుంటేనే అన్నీనోయ్"

"ఏమిట్రా అన్నయ్యా! ఏం చెబుతూన్నావ్?" అంటూ పరుగెత్తుకొచ్చింది, ఎనిమిదేళ్ల ఇందు. ఆవెనకాలే అయిదేళ్ల సూర్యం "నాకూ చెప్పాలి...నాకూ చెప్పాలి"అంటూ వచ్చాడు.

"అబ్బ! వుండండ్రా, మీగోలేమిటే?" అంటూ, "కూర్చోవే అమ్మా"అని తల్లిని కుర్చీలో కూలేసి, అందుకున్నాడు:

"ప్రొద్దున స్కూలు కెళ్లానా అమ్మా! తోవలోనే తెలిసిందే అరెస్టులసంగతీ. దుకాణాలన్నీ మూసినవి మూసినట్టుగానే వుండిపోయినై. స్కూలుపిల్లలంతా 'ఇవ్వాళ వెళ్లొద్దు, వెళ్లొద్దు. అంటూ రోడ్లంబడి తిరగటం మొదలెట్టారు. నన్నూ ఆపారు. కాని అసలు మా స్కూలుసంగతి ఎల్లా వుందో తెలుసుకుందామని వాళ్లనంతా తప్పించుకుని వెళ్లాను. స్కూలు చేరగానే పిల్లలంతా గుంపులుగుంపులుగా వుంటం చూసి, నాకెక్కడలేని సంతోషం కలిగింది. అప్పటి కింకా బెల్లు కాలా. నేను వెళ్లగానే నాచేతిలో ఒకకాగితం పెట్టి సంతకం చెయ్యమన్నారు. మారుమాట్లాడకండా ముందు సంతకం పెట్టి, తర్వాత చదివాను. ఇవాళొక్కరోజుకోసం బడి మూసేయించమని హెడ్‌మాస్టర్ని కోరారు అందులో. అంతే. ఇంతలోకి హెడ్‌మాస్టరుకూడా వచ్చాడు. వచ్చీరావటమే మమ్మల్ని చూసి వుగ్రుడై పోయాడు. "ఇక్క డేం చేస్తున్నారు? క్లాసుల్లోకి పోరేం?"అంటూ గదమాయించాడు. దాంతో ఇందాకా ఎంతో ధైర్యంతో మాట్లాడుతూన్న పిల్లలంతా ఒఖ్ఖసారి పిల్లికూన లైనారు. ఎవరిమట్టుకువారు జారుకోటం మొదలెట్టారు. హెడ్‌మాస్టర్ గూడా ఆఫీసులోకి వెళ్లి పోయాడు. వెనకాలే మా మానీటరూ, ఇంకోఅబ్బాయీ అప్లికేషన్ తీసుకునివెళ్లారు. దాంతో అతను మరీ వుగ్రుడైపోయి, ఆ అప్లికేషన్ పూర్తిగా చదవకుండానే చించిపారేసి, నానా చీవాట్లూ పెట్టాట్ట. తనూ వెంటనే వోబెత్తం చేతపుచ్చుకుని బయలుదేరే సరికి ఎక్కడివాళ్ళక్కడ క్లాసుల్లోకి మాయమయ్యారు. నేనూ క్లాసులోకి వెళ్లిపోయా. హెడ్‌మాస్టర్ వొకొక్కక్క క్లాసే తిరుగుతూ, ఇల్లాంటి ఆటలు తన దగ్గిర సాగవనీ, ఎవరేనా తన కెదురుతిరిగారా వెంటనే స్కూలునించి డిస్మిస్‌చేయటమేకాకండా పోలీసువాళ్ల చేత బాగా తన్నిస్తాననీ అంటూ మహోమూకుడుగా లెక్చర్లు దంచటం మొదలెట్టాడు. దాంతో మాకు చెడ్డ వుద్రేకం కలిగినా ఏమీ చేయలేక, ఒహరిమొహో లొహరం చూసుకుంటూ వూరుకున్నాం. అతను వెళ్లిపోగానే మళ్లీ గుసగుసలు బయలుదేరినై. అవి కాస్తా పెరిగి చర్చల్లోకి దిగాయి. మాస్టర్లు వేడుకున్నారు. బెదిరించారు. రిపోర్టు చేస్తామన్నారు. కాని ఎవరు వింటారూ? ఇంతలో రిపోర్టులమీద రిపోర్టులు వస్తునై—అన్నిస్కూళ్లూ, కాలేజీల పిల్లలంతా కలిసి ఒకొక్కక్కస్కూలే తిరుగుతున్నారనీ, ఇక్కడికీ ఇహ వస్తారనీ. ఇది వినగానే మాకు ఎక్కడలేని వుత్సాహం పుట్టుకొచ్చింది. హెడ్‌మాస్టరుకూడా ఈ సంగతి తెలిసిందిగానాల్ను, వెంటనే స్కూలుగేటు మూయించేసి, తాళం వేయించాడు. ఈ సంగతి తెలియగానే మాకు మరీ మండుకొచ్చింది. నిజంగా అమ్మా! అప్పుడు మేమంతా శత్రుకోటలో బంధింపబడివున్న ఖైదీల్లాగానూ, ఆ వచ్చే సోదరవిద్యార్థులు ఈ కోటను ముట్టడించి మమ్మల్ని విడిపించుకుపోయే మిత్రసైన్యంలాగానూ అనిపించిందంటే నమ్ము. ఎప్పుడెప్పుడా అని కూర్చున్నాం. క్షణంగడవటం కష్టమైపోయింది. మాలో కొంతమంది చెట్లెక్కి కూర్చున్నారు వాళ్ల రాక కెదురుచూస్తూ. గేటుదగ్గిరా, వరండాలోనూ మేస్టర్లూ, ప్యూన్లూ కాపలాకాస్తున్నారు హెడ్‌మాస్టర్ ఆజ్ఞ ప్రకారం. ఇంతలోకి "వస్తున్నారు!...వస్తున్నారు!" అంటూ కేకలేశారు చెట్టుపైన వున్నవాళ్లు. అప్పుడే స్కూలుకాంపౌండుఆవల్నించి "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అన్న అరుపులు వినిపించాయి. దాంతో, లోపలవున్న మా వుద్రేకమూ కట్టతెగి ప్రవహించింది. ప్రతికంఠం ఎలుగెత్తి అరిచింది. "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అని. క్లాసుల్లో ఒక్కరూ వుండకుండా అందరూ గేటువేపు పరుగెత్తారు అరుస్తూ. మేస్టర్లు ఏమీ చేయలేక చూస్తూ నిలుచుండిపోయారు. ప్యూన్లకి ధైర్యమాగక మూలలకి నక్కారు. ఒక్క హెడ్‌మాస్టర్‌మాత్రం చేతిలో బెత్తంతో కాలుకాలిన పిల్లిలా

అటూ ఇటూ తిరుగుతూ, మేస్టర్లనీ, ప్ర్యూన్లనీ, పిల్లల్ని తిడుతూ, చేతికందినవాడినల్లా బెత్తంతో బాత్తున్నాడు. నేను గేటుదగ్గర కెళ్ళేసరికి, ఓ పిల్లవాడు తాళం విరకొట్టానికి ప్రయత్నంచేస్తున్నాడు. హెడ్‌మాస్టర్ తన కసికొద్దీ ఆ పిల్లాడివీపుమీద బెత్తంతో బాత్తున్నాడు. అయినా ఆ అబ్బాయి చలించకుండా తనపని తను చేస్తూనేవున్నాడు. అమ్మా! ఆ దృశ్యం ఇప్పటికీ కళ్లకట్టినట్టుగా వుంది. అందరూ భయాశ్చర్యాల్తో చూస్తూ నిల్చున్నారు. ఒక్కరికీ ధైర్య మాగలా. ఆ దృశ్యం చూసేసరికి నా కళ్లల్లోకి నెత్తురు దుమికింది. నన్ను నేనే మరిచిపోయా. ఒక్కదూకులో వెళ్లి హెడ్‌మాస్టర్ని తోసేసి, ఆయనచేతిలోంచి బెత్తం లాక్కొని దాన్ని తునకతునకలుచేసి పారేశా, నా కసంతా దానిపైనే తీరుస్తూ. నేను ముందంజవేయగానే అందరిలోనూ ఒక్కసారి చలనం కలిగింది. కాని అది కనిపెట్టి హెడ్‌మాస్టర్ వెంటనే ఆఫీసులోకి పరుగు తీసి, లోపల్నించి గడియవేసుకున్నాడు. ఇంతలోకి గేటుతాళం వూడతీశారు. ఆవలున్న జనప్రవాహమంతా ఒక్కసారి లోపలికి కొట్టుకొచ్చింది. అంతా కలిసి జైజైరావాలు చేస్తూ ఆఫీసుకేసి పరుగెత్తారు. ఒక్క తన్నుకి తలుపు వూడిపడ్డది. లోపల ఫోన్‌దగ్గర వున్నాడు హెడ్‌మాస్టర్. వెళ్లి కాలర్ పట్టుకు ఈవలికి లాక్కొచ్చారు. అతని మొహం చూడగానే నా కోపం మరీ హెచ్చింది. నా బలంకొద్దీ ఒక్క లెంపకాయ వెయ్యాలని చేయెత్తాను. కాని నా చేయి నెవరో అట్టానే పట్టుకున్నారు. వెనక్కు తిరిగి చూస్తే ఓ ఖద్దర్ యువకుడు కనిపించాడు వొద్దని నన్ను వారిస్తూ. అమ్మా! అత నెంత మంచివాడనుకున్నావ్! పేరు అబ్దుల్లాట; లాకాలేజీ విద్యార్థట. పఠానబ్బాయిలాగున్నాడు. అతను ముందుకొచ్చి హెడ్‌మాస్టర్ చేయి పట్టుకోగానే గజగజ వడికిపోయాడు హెడ్‌మాస్టర్. 'కొట్టండి, తన్నండి' అన్న గోల మరీ ఎక్కువైంది. కాని అబ్దుల్లా చేయెత్తగానే అంతటా నిశ్శబ్దం! అతనే మాకంతా నాయకుడని నేనప్పుడే తెలుసుకున్నాను. "ఆ అబ్బాయి నెందు కల్లా కొట్టావ్?" అని శాంతంగానే అడిగాడు అబ్దుల్లా. హెడ్‌మాస్టర్‌నోట మాట లేదు. "ఆ అబ్బాయిని క్షమాపణ వేడుకో" అన్నాడు 'హుకుం' ఇస్తూన్నట్టుగా అబ్దుల్లా. దానికి హెడ్‌మాస్టర్ తటపటాయించటం మొదలెట్టాడు. "ఊఁ, కానీవేం?... నేనింకెప్పుడూ అల్లా చెయ్యనని చెంపలు వేసుకో" అని గర్జించాడు అబ్దుల్లా."

"వేసుకున్నాడా?" అంది తల్లి ఆదుర్దాగా.

"ఆ, వేసుకోక గత్యంతరం వుందీ? తర్వాత మూడుసార్లు 'గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!' అనమని ఆజ్ఞాపించాడు అబ్దుల్లా."

"అన్నాడా?" అంది తల్లి కళ్లు పెద్దవిచేస్తూ.

"ఆ, అనకపోతే వూరుకుంటామూ? అన్నాకే మరి వదిలిపెట్టి ఈవలకొచ్చేసింది."

తల్లివొళ్లో కూచున్న సూర్యం 'గాంధీకీ జై! గాంధీకీ జై!' అంటూ చప్పట్లుచరవటం మొదలెట్టాడు.

"మీది మరీ దౌర్జన్యంరా అబ్బాయి" అంది తల్లి.

"ఏమిటే దౌర్జన్యం?"

"మీ రాయన్నట్టా ఏడిపిస్తారూ?"

"ఆ కుఱ్ఱాణ్ణట్టా కొడ్తాడూ? అది దౌర్జన్యం కాదేం?"

"ఎంతైనా వాళ్లు పెద్దవాళ్లు, మీరు చిన్నవాళ్లు".

"అమ్మా! పెద్దవాళ్లు పెత్తనం నిలబెట్టుకోనప్పుడు చిన్నవాళ్లు చిన్నతనం మీరితే అది చిన్నవాళ్ల తప్పేనా? మేము పొద్దున సవినయంగా అడిగినప్పుడు స్కూలు మూసేసివుంటేయేం?"

"ఏమోరా అబ్బాయ్! మీ పోకళ్లు నాకేం అర్థంకావు. సరేగాని కాఫీ తాగుతావా?"

"ఆ, మరందుకేగా వచ్చిందీ? ఏమేనా ఫలహారంకూడా వుంటే పెట్టవే, ఆకలేస్తోందీ. మధ్యాహ్నం హోటల్‌కికూడా వెళ్ల లేకపోయాను......ఊఁ, త్వరగా"

"ఇంకా ఎక్కడికేనా వెళ్లాలా యేం?"

"అయ్యో, తిన్నగా అడుగుతున్నావూ, ఇప్పుడు పార్కులో పెద్ద మీటింగు జరగబోతూంటేనూ!

విద్యార్థిబృందమంతా ఈ పాటికి చేరే వుంటుంది. మహా గొప్పసభ అమ్మా! అబ్దుల్లా, శర్మా, నరేందర్, కామ్రేడ్ సావిత్రి, ఇంకా ఇంకా ఎంతోమంది లెక్చర్లి స్తారటమ్మా! నే నెన్నడూ వాళ్లని చూడనేలేదే..."

"కాని మీ నాన్నగారు వచ్చే వేళ అయింది గదరా?"

"వస్తేయేం?" అన్నాడు ధీమాగా మూర్తి.

—"ఒరే మూర్తీ!!!"

మూర్తివళ్లు ఝల్లుమంది! తండ్రికంఠంలో అంత కఠినత్వం వుందని తా నెన్నడూ అనుకోలేదు. తల్లీ, కొడుకూ ఒకరిమొహాలు ఒకరు చూస్తూ నిలుచుని పోయారు.

ఇంతసేపూ నిశ్శబ్దంగా వింటూన్న ఇందు, "నాన్నోయ్! ఏం జరిగిందంటేనూ......" అంటూ లేచింది.

"ఒసే నీకెందుకే?" అంటూ ఆపబోయింది తల్లి. కాని తల్లిమాట విని చచ్చారూ ఎవరేనా?"నాన్నోయ్! ఇవ్వాళ అన్నయ్యబళ్లోనే..." అంటూ నాన్నదగ్గరికి పరుగెత్తింది. కాని "ఛీ, పో"అన్న గదమాయింపు వినబడగానే అమ్మగారి దిమ్మ తిరిగింది. మధ్య తా నేంనేరం చేసిందో అర్థంకాక కళ్లల్లో నీళ్లు గుక్కు కుంటూ మెల్లిగా జారుకుంది. సూర్యం చంకదిగి, "నాన్నోయ్! గాంధీకీ జై! నాన్నోయ్! గాంధీకీ జై!"అంటూ తండ్రిదగ్గర కెళ్లి గంతులెయ్యటం మొద లెట్టాడు. కాని ఫెళ్లుమని చెంప వాగ్గానే బావురుమని రాగం తీశాడు. తల్లి వెళ్లి కొడుకు నెత్తుకుని—భర్త నిప్పు డేమన్నా ప్రమాదమేనని గ్రహించుకుని—బుజ్జగించటం మొదలెట్టింది.

ఇదంతా గమనిస్తూన్న మూర్తికి హడలెత్తి పోయింది. నాన్న కంతా తెలిసిపోయిందా?

"ఒరే, రావేం?"అన్న గర్జన వినబడగానే గుండె గుభేలుమంది. ముందుకు సాగలేకసాగలేక అడుగులో అడుగు వేసుకుంటూ, వెనక్కి తిరిగితిరిగి తల్లికేసి దీనంగా చూస్తూ వెళ్లి తండ్రిఎదట తలవంచుకుని నిలుచున్నాడు.

తండ్రి అసహ్యాన్నీ, కోపాన్నీ వెళ్రగక్కే దృక్కుల్తో కొడుకుని ఎగాదిగా చూసి "వెధవా" అన్నాడు. తన చేతిలో వున్న వుత్తరం అందిస్తూ 'చూడు' అన్నాడు అధికారస్వరంతో. భయపడ్తూ భయపడ్తూ, వడికే చేతుల్తో ఆవుత్తరం అందుకున్నాడు మూర్తి. అది హెడ్‌మాస్టర్ తన తండ్రికి రాసినవుత్తరం. అందులో తానారోజు చేసినవన్నీ ఒకటికి నాలుగు పెంచిరాస్తూ "మీమొహం చూసి వూరుకున్నాను. లేకుంటే ఈపాటికి మూడేండ్లవరకు రస్టికేట్ చేయించేసివుందును. ఇప్పటికేనా వెంటనే అపాలజీ(క్షమాపణ)రాకపోతే రిపోర్టుచేయకతప్పదు" అని వుంది. వళ్లుమండింది మూర్తికి. వెళ్లి హెడ్‌మాస్టర్ని చావ తన్నాలన్నంత బుద్ధిపుట్టింది. కాని ఎదట తండ్రివుగ్ర స్వరూపం కనిపించగానే కోపమంతా నీర్గైపోయింది.

"కూర్చో"అన్నాడు తండ్రి కఠినంగానే. కూర్చున్నాడు.

డెస్కులోంచి రైటింగ్‌పాడ్ తీసి మూర్తి ముందుకు విసిరి, "ఊఁ, రాయి"అన్నాడు తండ్రి. ఏమిటి? అపాలజీయే?? ముచ్చెమట్లు కమ్మాయ్ మూర్తికి. ఒక్కసారి చురుకు పుట్టుకొచ్చింది. "కాని, నాన్నా..." అంటూ ఏదో సంజాయిషీ ఇచ్చుకో బోయాడు.

తండ్రి గుడ్లెఱ్ఱజేస్తూ"ఛీ, నోర్ముయ్. ఇంకా మాట్లాడుతున్నావ్ నోరెట్టుకుని! నే చెప్పినట్టుగా రాయ్"అన్నాడు.

తల వంచేసుకున్నాడు మూర్తి. "ఏమిటీ అన్యాయం? విచారణ లేకుండానే శిక్షా?—ఇంగ్లీషు వాళ్లకి మల్లేనే! ఎదురుతిరగమని కోరింది హృదయం. సాహసించవద్దని హెచ్చరించింది బుద్ధి. మరుమాటాడకుండా రాస్తున్నాడు......తాను చేసిన పనికి విచారిస్తూన్నాననీ, ఇక నెప్పుడూ అల్లా చెయ్యననీ, చేస్తే మీఇష్టం వచ్చిన శిక్ష విధించవచ్చుననీ, ఇప్పుడు ఒకసారిమాత్రం క్షమించవలసిందనీ, అల్పశిక్షేదేనా ఇస్తే స్వీకరిస్తాననీ వేడుకుంటూన్నట్టు రాస్తున్నాడు...... కలాన్ని తన రక్తనాళాల్లో ముంచి, తన హృదయం

ఫలకంమీద ఒక్కొక్క అక్షరమే చెక్కుతూన్నట్టుగా బాధపడుతూన్నాడు మూర్తి. ఇది క్షమాపణపత్రమేనా? తానేనా రాసేది? కాదని ఎట్లా అనుకోటం, కళ్లారా చూస్తూనే? రేపు తానేమొహం పెట్టుకు తిరుగుతాడు? తోటివిద్యార్థులకు అపాలజీసంగతి తెలిశాక తానిక బతగ్గలడా......ఛీ! ఏం బతుకీపాడు బతుకు!......ఈ కలం విరిగిపోదేం? కాగితం చిరిగిపోదేం?...తానింకా బతికేవున్నాడేం?...కలాన్ని విసిరి తండ్రిమొహాన కొట్టి, కాగితం చించిపారేసి, పెద్దపెట్టున యేడవాలనిపించింది!......కాని అదేమీ జరక్కుండానే పత్రం పూర్తైంది.

సంతకం పెట్టబోయేముందు మళ్లీ ఒక్ఖసారి కోపం పొంగుకొచ్చింది. కాని ఆపొంగు వెంటనే చల్లారిందికూడాను. రెక్కల్లేని పక్షిలా రెపరెపలాడి వూరుకుంది హృదయం.

వడికే చేత్తో, తనకే కొత్తగా కనిపించే అక్షరాల్లో గబగబా సంతకం గీకేసి, ఇహ అక్కడొక్క క్షణంకూడా నిలవలేక తన గదిలోకి పరుగెత్తుకెళ్లి మంచంపైన దభాలున పడిపోయాడు, వెక్కి వెక్కి ఏడుస్తూ.

కోపం, అసహాయతా కలిస్తే, దుఃఖమేగా ఫలితం!

